

కుంకుమార్చన కౌంటర్ వద్ద బారులు తీరిన భక్తులు

● శ్రావణ మాసం ఎఫెక్ట్

కిక్కిరిసిన అమ్మవారి ఆలయం

శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళా భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. కుంకుమార్చన సేవా టికెట్ల కోసం పోటీపడ్డారు. అమ్మవారి సర్వదర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. సుపథం దర్శనానికీ రద్దీ పెరగడంతో భక్తులు క్యూలలో బారులుతీరారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. లడ్డూ కౌంటర్, నిత్యాన్నదానం వద్ద భక్తుల సందడి కనిపించింది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



సముద్రం అల్లకల్లోలం

తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

అల్పపీడన ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉద్రిక్తంగా ఎగిసిపడుతున్నాయి. వాకాడు, కోట, చిల్లకూరు, తడ మండలాలలో సుమారు 69 కిలోమీటర్ల మేర విస్తరించిన తీరంలో రాకాసి అలలు ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఇలా.. భద్రపరిచారు



నాయుడుపేట మండలం పుదూరులో అధికారుల అనుమతి లేకుండా గురువారం గాంధీ విగ్రహాన్ని కొందరు చోటా నాయకులు పగలగొట్టి శ్మశానంలో పడేశారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో శుక్రవారం ఎంపీడీవో సురేష్‌బాబు గ్రామానికి చేరుకొని విగ్రహాన్ని తీసేసిన స్థలాన్ని పరిశీలించారు. శ్మశానంలో పడేసిన గాంధీ విగ్రహ భాగాలను తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచారు. ఈ ఘటనపై గ్రామంలోని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎంపీడీవో లేదా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదవుతుందని అర్బన్ సీఐ బాబీ తెలిపారు.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో 12 మెగావాట్లతో

వేస్ట్ టు పవర్ ప్లాంట్

సీఎం వచ్చిన ఆరు రోజుల్లోనే అనుమతిస్తూ జీవో జారీ

మూడు జిల్లాల నుంచీ 600 టన్నుల చెత్త సేకరణ

33 ఎకరాల భూమి గుర్తించాలంటూ కలెక్టర్‌కు లేఖ



ఈనెల 19వ తేదీన తూకివాకం వద్ద ప్లాంటును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ టు పవర్ ప్లాంటు (చెత్త నుంచి కరెంటు తయారీ) ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన పలు నగర, పురపాలక, పంచాయతీల నుంచీ రోజువారీ 600 టన్నుల చెత్తను సేకరించి దాంతో కరెంటు ఉత్పత్తి చేసేలా పరిధిని సైతం నిర్ణయించారు. పవర్ ప్లాంట్ కోసం అనువైన 33 ఎకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవాలని ఏపీ (నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ఎన్‌ఆర్‌ఈడీసీని ఆదేశించింది. కాగా, తిరుపతిలో ఏర్పాటయ్యే పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన చెత్తను సమీకరించేందుకు గానూ ప్రభుత్వం తిరుమల సహా అన్నమయ్య జిల్లా కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా, పీలేరు మేజర్ పంచాయతీ, చిత్తూరు జిల్లా నుంచీ చిత్తూరు కార్పొరేషన్, పలమనేరు, నగరి మున్సిపాలిటీలు, తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, చంద్రగిరి, రేణిగుంట మేజర్ పంచాయతీలు, తిరుపతి రూరల్ మండలాలను ఎంపిక చేసింది. వీటిలో రోజువారీ వచ్చిపడే 600 టన్నుల చెత్తలో అత్యధికంగా తిరుపతి కార్పొరేషన్ నుంచీ 227 టన్నులు వస్తోంది. తర్వాత తిరుమల నుంచీ 90, చిత్తూరు నుంచీ 62, శ్రీకాళహస్తి నుంచీ 50 టన్నుల చొప్పున చెత్త ఈ ప్లాంటుకు చేరనుంది. ఈ వ్యవహారంలో సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు ఎంత వేగంగా ఉంటాయన్నది జిల్లా ప్రజలకు మరోసారి తెలిసి వచ్చింది.

12 ప్రాంతాలకు సంబంధించి ప్లాంట్‌కు దూరం, సేకరించే చెత్త పరిమాణం వివరాలిలా ఉన్నాయి.

ప్రాంతం	ప్లాంట్‌కు దూరం (కి.మీ)	రోజువారీ చెత్త (టన్నుల్లో)
తిరుపతి	000	227
పుత్తూరు	34	24
శ్రీకాళహస్తి	40	50
నగరి	49	14
చిత్తూరు	70	62
పలమనేరు	108	18
తిరుపతి రూరల్	15	30
చంద్రగిరి	16	20
కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా	50	25
రేణిగుంట	10	20
పీలేరు	50	20
తిరుమల	35	90

అంతా.. ఆరు రోజుల్లోనే : సీఎం చంద్రబాబు ఈనెల 19వ తేదీన తిరుపతి పర్యటనకు వచ్చారు. ఆ సందర్భంగా తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన రేణిగుంట మండలం తూకివాకంలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటును పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ బాగుందని అధికారులను అభినందించారు. అక్కడ చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది జరిగిన సరిగ్గా ఆరో రోజు కల్లా శుక్రవారం తిరుపతిలో 12 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్ టు పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇలా ఆరు రోజుల్లోనే సీఎం సూచన.. కార్యరూపం దాల్చడం, చంద్రబాబు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనం.

అనన్య సందడి

సినీ నటి అనన్య శుక్రవారం చిత్తూరు, తిరుపతి నగరాల్లో పర్యటించారు. తాను బ్రాండ్ అంబాసిడర్‌గా వున్న ఏషియన్ పెయింట్స్ దుకాణాలను సందర్శించారు. గుర్తుపట్టిన జనాలతో సెల్ఫీలు దిగి సందడి చేశారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు



పరిహారమిచ్చే వరకు భూముల్లో దిగనివ్వం

● రోడ్డుపై బైఠాయించి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'భూములను తీసుకునేటప్పుడు తియ్యగా మాటలు చెప్పారు.ఇప్పుడేమో పరిహారం కోసం ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. అడిగి అడిగి మాకు ఓపిక నశించింది.పరిహారం ఇచ్చేంతవరకు భూముల్లోకి దిగనివ్వం' అంటూ రైతులు రోడ్డుపై బైఠాయించి టిప్పర్లను అడ్డగించారు. రైతుల కథనం మేరకు.. కోట మండలం నెల్లూరుపల్లికొత్తపాళెం గ్రామాలకు చెందిన 24 మంది రైతులు ఎకరా రూ.పది లక్షల చొప్పున ఆప్కో సంస్థ ద్వారా సాగరమాల రోడ్డు విస్తరణకు ఇచ్చారు. ఆ రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు పైసాకూడా పరిహారం ఇవ్వలేదు. ఈ క్రమంలో శుక్రవారం విశ్వనాథపుర అగ్రహారం వద్ద రైతులు సాగరమాల రోడ్డుపై బైఠాయించారు. టిప్పర్లను పొలాల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఉదయం 10నుంచి రాత్రి 8.30 గంటల వరకు రైతులు రోడ్డుపైనే కూర్చున్నారు. తహసీల్దారు జయజయరావు సంఘటనాస్థలికి చేరుకొని రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్ తదితరులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాతో చర్చించి ద్వారా రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. శనివారం నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అధికారులకు చెప్పి రాత్రి 8.45 గంటలకు రైతులంతా ఇళ్లకు వెళ్లిపోయారు.

నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

● వైద్యులకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచన



ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్యులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

తిరుపతి(వైద్యం), జూలై 25(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే మెరుగైన వైద్యసేవలు అందించగలరని డాక్టర్లకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు. తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో అల్మిని అసోసియేషన్ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఇప్పటికే రోబోటిక్ వైద్యసేవలు పెరిగిపోయాయి. వాయిస్ అథారిటీ వైద్య చికిత్సలు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఇక, అత్యాధునిక వైద్య పరికరాలు రానున్నాయి. ఇలా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తగ్గట్టు వైద్యులు తమ వైద్య పద్ధతులను మార్చుకోవాలి. సేవా భావాన్ని జీవన వైద్యంలో జనరిక్ మెడిసిన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)లో ఆధునిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయాలి' అని సూచించారు. రోగులు వైద్యంకోసం తమ శరీరాన్ని పూర్తిగా వైద్యులకు అప్పగిస్తారంటే వైద్యులపై వారికి ఎంత నమ్మకం ఉంటుందో గ్రహించాలన్నారు. ఆ నమ్మకానికి తగిన రీతిలో వైద్యులు నడుచుకోవాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే మన రాష్ట్రంలో ప్రతిభ కలిగిన డాక్టర్లు ఉన్నారన్నారు. 50 ఏళ్లుగా అల్మిని అసోసియేషన్ చేస్తున్న సేవలకు, కృషికి తిరుపతి మోడల్‌గా గుర్తించాలన్నారు. అనంతరం ఆయన ఉత్తమ వైద్యసేవలు అందించిన పలువురు డాక్టర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. అల్మిని అసోసియేషన్ నెట్వర్క్ ప్రతీ వైద్య కళాశాలకు వెన్నుముకలా గొప్ప సహకారం అందిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, అల్మిని అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ రమేష్‌బాబు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభ, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీసీ అప్పారావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా యూనివర్సిటీలో ఫ్లెక్సీలు, బ్యానర్ల సంస్కృతి పెరుగుతోందని భావించారు. వీటివల్ల విద్యార్థులు, ఉద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీని సందర్శించే మేధావులు, శాస్త్రవేత్తలు ఇటువంటి ఫ్లెక్సీలను చూసి ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఇందుకు సహకరించాలని కోరారు.

తిరుపతికి 'నీవా' నీళ్లు

● 'తొలి అడుగు'లో మంత్రి నిమ్మల



తిరుపతి, జూలై25(ఆంధ్రజ్యోతి): 'నీవా' బ్రాంచ్ కెనాల్ ద్వారా కళ్యాణి డ్యామ్ నింపి తిరుపతికి తాగునీటిని అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తిరుపతి చింతలచేను వద్ద శుక్రవారం జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. దుస్తులు ఇస్త్రీ చేస్తూ, నీటిబిందెలు అందిస్తూ జనంతో మమేకమయ్యారు. తిరుపతికి తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందించేలా కండలేరు రిజర్వాయర్ నుంచి మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామన్నారు. 'అధికారం వస్తే రప్పా..రప్పా నరికేవాళ్లు కావాలా? సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అందించి చల్లగా చేసుకునేవాళ్లు కావాలా? ఆలోచించండి' అంటూ ప్రజలకు సూచించారు. తప్పులు చేసేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు రుద్రకోటి సదాశివం, ఎన్.విజయకుమార్, బీవీ కీర్తి, శ్రీధర్ వర్మ, ఊకా విజయ్‌కుమార్, సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూరు భాస్కర్‌యాదవ్, పుష్పావతి యాదవ్, అన్నా అనిత, కరాటే చంద్ర, పాటకం వెంకటేష్ పాల్గొన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం



భాకరాపేటలో కరపత్రాలు పంచుతున్న చిట్టెమ్మ

భాకరాపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట బలిజపల్లెలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, లోకనాథం, శ్రీధర్, డిష్ మణి, తదితరులు పాల్గొన్నారు.

'మా ఊర్లోనే పాఠశాల నిర్వహించాలి'

పాకాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'మా ఊళ్లోనే పాఠశాలను కొనసాగించాలి' అని చిగరపల్లె గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగరపల్లె గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చక్కని తరగతి గదులు, ప్రహరీ, తాగునీరు, ఆటస్థలం సౌకర్యాలు వున్నా 3,4,5 తరగతులను ఎలాంటి సౌకర్యాలు లేని మూడు కిలోమీటర్ల దూరంలో వున్న పాఠశాలలకు తరలించడం తగదన్నారు. అక్కడికి వెళ్లిరావడానికి పిల్లలు అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. తమ ఊళ్లోనే తరగులు నిర్వహించేలా చూడాలని విన్నవించారు. అలాగే మండల కేంద్రానికి వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసుల గౌడ్, గోపి, మునీంద్ర, కుమార్, సుబ్రమణ్యం, ధనలక్ష్మీ, గౌరీ, రాధిక, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి

రామచంద్రాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే మహిళా సంఘాల సభ్య సమావేశాలకు సిబ్బంది విధిగా హాజరై ప్రకృతి వ్యవసాయ సాగు, ప్రగతి విధి విధానాలను తెలియజేయాలన్నారు. మామిడి, వరి పంట నూర్పిడి అవడంతో ఆ పొలాల్లో పీఎండీఎస్ కిట్లను చల్లడానికి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పొలాల్లో ఏటీఎం, ఏ గ్రేడ్ కిచెన్ గార్డెన్ వేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పట్టాభిరెడ్డి, విమల, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డికి సన్మానం



తిరుపతి(విద్య),జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుపతిపర్యటనలో భాగంగా త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డి శుక్రవారం స్థానిక ఆర్ఎస్‌మాడా వీధిలోని బీజేపీ నేత అజయ్‌కుమార్ ఇంటిని సందర్శించారు. ఈయన్ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రమణ్యం, నాయకులు వరప్రసాద్, జల్లి మధుసూదన్ మార్యదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సన్మానించారు.

ఆకట్టుకున్న పాండవ జననం



హరికథ చెబుతున్న భాగవతారిణి

తిరుపతిరూరల్,జూలై25(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్ర గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి రాణిరెడ్డి శుక్రవారం ఆలపించిన పాండవ జననం హరికథ ఆకట్టుకుంది. రాత్రి శ్రీవేంకటేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన చేసి సభికులను అలరింపజేశారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, ఉభయదారుడు చెంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతీ దేవి సాక్షాత్కారం



తిరుచానూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువ జామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

హోంమంత్రికి సాదర స్వాగతం



రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనితకు సాదర స్వాగతం లభించింది. శుక్రవారం శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి వందే భారత్ రైల్లో విజయవాడ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్‌కు రాత్రి చేరుకున్నారు. ఆమెకు ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, తదితర పోలీస్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

చంద్రగిరి

నేడు ఉపాధి హామీ తనిఖీ సమావేశం

తిరుపతిరూరల్, జూలై25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ సమావేశం జరగనుందని ఎంపీడీవో కె.రామచంద్ర పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులు సమర్పించాలని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు ఈ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

భాగవతారిణికి సత్కారం



భాకరాపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరా పేటలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా పగలు హరికథ చెబుతున్న భాగవతారిణి జోష్నను భాకరాపేటకు చెందిన ముస్లిం మైనారిటీ నేత షాజహాన్ శాలువ, పూలమాలలు, చీర, సారెతో సత్కరించాడు. షాజహాన్‌ను పలువురు అభినందించారు.

రేపు విజేతలో ఏబీవో/ఎఫ్‌బీవోపై ఉచిత నమూనా పరీక్ష

తిరుపతి(విద్య),జూలై25(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లె సర్కిల్‌లోని శ్రీవిజేత అకాడమీలో ఆధ్వర్యంలో ఏబీవో/ఎఫ్‌బీవో ఫారెస్ట్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఆదివారం ఉదయం10గంటలకు ఉచిత నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు అకాడమీ ప్రతినిధి పేర్కొన్నారు. దీనిలో భాగంగా అనుభవం ఉన్న అధ్యాపకుల నేతృత్వంలో ఈ పరీక్షకి సంబంధించిన ప్రిపరేషన్‌లో పాటించాల్సిన మెళకువలపై సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 8317541400, 8019959801 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ మంగళం రూరల్ పరిధిలో విద్యుత్ కేబుల్స్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రనగర్ సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా నారా రోహిత్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న ప్రణీత్ ఫౌండేషన్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నారా రోహిత్ పుట్టిన రోజు వేడుకలను ప్రణీత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు బాణసంచా పేల్చి, కేక్‌కట్ చేశారు. రుయా ఆస్పత్రి వద్ద ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రణీత్ పెనుమాడు సూచనల మేరకు 800మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్మాన్

- భారీగా తరలివచ్చిన జనం
- పూలు, పండ్ల కోసం ఎగబడ్డ భక్తులు



తపస్మాన్ వద్ద ఒరపడ్డ మహిళలు



తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

రామచంద్రాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్జున వేషధారి శివుని పాశుపతాస్త్రం సాధించేందుకు ఆలయం ముందు ఏర్పాటు చేసిన తపస్మాన్ అధిరోహిస్తూ శివుడిని ప్రార్థన చేశాడు. శిఖరాగ్రం చేరుకుని పూలు, పండ్లు విసరడంతో భక్తులు వాటిని అందుకున్నారు. తమ కోర్కెలు తీర్చాలని భక్తులు తపస్మాన్ చుట్టూ వరపడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి అనసూయ పద్మవ్యూహంలో అభిమాన్యుడు కౌరవులతో పోరాడిన ఘట్టాలను అద్భుతంగా వినిపించారు. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు గ్రామ పురవీధుల్లో ఘనంగా సాగింది. గ్రామస్తులు మంగళ హారతులు సమర్పించారు. రాత్రి వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కీచక వధ వీధినాటక ప్రదర్శన సభికులను విశేషంగా కట్టిపడేసింది. అర్జున తపస్మాన్ కార్యక్రమానికి ఉభయదాతగా కొట్టే ముద్దుకృష్ణారెడ్డి వ్యవహరించారు.

అర్ధరాత్రి ఓ యువతి కోసం వచ్చిన యువకుడు

దొంగ అనుకొని చితకబాదిన గ్రామస్తులు

పోలీసులకు అప్పగింత



కాలువలో దూకేసిన సురేష్

చంద్రగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, మల్లయ్యపల్లె గ్రామంలో అర్ధరాత్రి ఓయువతి కోసం పెనుమూరుకు చెందిన ఓయువకుడు వచ్చాడు. గ్రామస్తులు ఆ యువకుడిని దొంగ అనుకొని చితకబాదారు. కత్తి, తాయత్తులు ఉండటంతో పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల కథనం మేరకు.. పెనుమూరుకు చెందిన సురేష్‌కి మల్లయ్యపల్లెకు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఆ యువతిని తన సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో గురువారం అమావాస్య అర్ధరాత్రి పూట మల్లయ్యపల్లెలో ఆ యువతి ఇంటి ముందు ఓలగేజీ వ్యానులో దాగి ఉండగా గ్రామస్తులు గమనించి కేకలు వేశారు. ఆ యువకుడు కేకలు వేసిన వారిపై రాళ్లు విసిరాడు. వెంటనే మరోచోట దాక్కున్నాడు. ఇంతలో గ్రామస్తులు మరింత మంది పోగయ్యారు. అందరూ కలిసి అతడిని వెంటాడారు. అతడు తప్పించుకునే క్రమంలో కాలువలో దూకేశాడు. గ్రామస్తులు అతన్ని పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

అమరాలో వరల్డ్ బ్రెయిన్ డే



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రమాదేవి తదితరులు

రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలని అమరా హాస్పిటల్ ఛైర్మన్ ప్రసాద్ గౌరినేని, ఎండీ రమాదేవి సూచించారు. మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమరా హాస్పిటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోజూ వ్యాయాయం, యోగా, మనసుకు నచ్చిన పని చేస్తే ఒత్తిడి ఉండదన్నారు. ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్, విటమిన్స్ సరైన మోతాదులో తీసుకోవడం మంచిదన్నారు. ముఖ్యంగా ఆల్కహాల్, సిగిరెట్, ఇతర వ్యసనాలను దూరంగా ఉండి సామాజిక బంధాల్ని పెంపొందించుకోవాలన్నారు. ముఖ్య అతిథులు డీఎం హెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఈఎస్ఐ జేడీ రాధాకృష్ణ, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ ఆర్ఆర్‌రెడ్డి న్యూరో సమస్యలపై ప్రసంగించారు. అనంతరం అమరా హాస్పిటల్‌లో న్యూరో సమస్యలకు సంబంధించి అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలపై వైద్యులు అవగాహన కల్పించారు. హాస్పిటల్ సీవోవో భాగ్యలక్ష్మి, శ్రీధర్, న్యూరాలజీ హెచ్‌వోడీ ఆనంద్, డాక్టర్లు యశ్వంత్ సందీప్, విజయేంద్ర రెడ్డి, అనిల్‌బాబు, క్రిటికల్ కేర్ సిబ్బంది, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్వర్



బాధితులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పెండింగ్ ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలను డివిజన్ అధికారులు స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెండవ త్రైమాసిక జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కమిటీ సభ్యులు విన్నవించగా అందుకు కలెక్టర్ సాను కూలంగా స్పందించారు. కమిటీ సభ్యులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని విన్నవించగా కలెక్టర్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిమూలం, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, డీఆర్వో నరసింహులు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవో కిరణ్మయి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నీలం నిజాయితీ గల రాజకీయవేత్త

ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి



సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి నిజాయతీ గల రాజకీయవేత్త అని ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఎస్వీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ - ఆగ్రశ్రీ సంయుక్తంగా శుక్రవారం చేపట్టిన నీలం మూడవ స్మారక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నైతికత గల రాజకీయ నాయకుడిగా నీలం ఎంతో దార్శనికతతో పనిచేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా వ్యవసాయ ప్రాముఖ్యతను నీలం అర్థం చేసుకున్నారని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణం నీలం దార్శనికతకు నిదర్శనమని అన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి దూరదృష్టితో ఏర్పాటైన ఎస్వీయూ 70 ఏళ్ల పైబడిన చరిత్రలో ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి యతిరాజులు మాట్లాడుతూ దేశానికి నీలం ఎంతో సేవ చేశారని, ఆయన కృషిని ఇటువంటి కార్యక్రమాల ద్వారా గుర్తు చేసుకోవడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి బీవీ మురళీధర్, ఆగ్రశ్రీ సంచాలకుడు సుందరరామ్, ఉపాధ్యక్షులు సాయికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురికి పురస్కారాల ప్రదానం

ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డికి విశిష్టరత్న, హైకోర్టు మాజీ న్యాయమూర్తి శేషశైనారెడ్డికి న్యాయ శిరోమణి, గీతం వర్సిటీ మాజీ వీసీ దయానందకు విద్యా శిరోమణి, ఆయుర్వేద వైద్యుడు జీవీ పూర్ణచంద్‌కు వైద్య శిరోమణి పురస్కారాలను అందజేశారు. ఆగ్రశ్రీ ప్రచురించిన విశేష సంచికను ఆవిష్కరించారు.

పట్టించుకోండి సారూ..!



పైపులైన్ లీకేజీ గేట్‌వాల్వ్ వద్ద గుంత తీస్తున్న కూలీలు

తిరుపతిరూరల్, జూలై25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లెలో ప్రాథమిక పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న వాటర్ పైపులైన్‌కి లీకేజీ సమస్య ఏర్పడడంతో మరమ్మతుల కోసం గుంత తీసి వదిలేశారు. ఈ పైపులైన్ వద్ద ఏర్పాటు చేసిన మూడు గేట్‌వాల్వుల ద్వారానే గ్రామంలోని పలువీధులకు, ఎస్సీ, ఎస్టీకాలనీలకి నీరు సరఫరా అవుతుంది. దీంతో మరమ్మతుల పనులు చేపట్టేందుకు సర్పంచ్ ప్లంబర్‌ని పిలిపించారు. పనులకు అయ్యే వ్యయం అంచనా వేయాలని పంచాయతీ సిబ్బంది ద్వారా కార్యదర్శికి సమాచారం అందించారు. అయితే కార్యదర్శి స్పందించకపోవడంతో కొంతసేపు వేచి చూసిన ప్లంబర్ వెనుదిరిగారు. దీంతో గేటు వాల్వులు బాగుపడకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి గ్రామంలో నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయ శనివారం మరమ్మతులు పూర్తిచేసి నీరు సరఫరా చేసేలా చర్యలు చేపడుతామని కార్యదర్శి అంటున్నారు.

తిరుపతిలో ఆటోల దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో ఆటోలు దొంగలిస్తున్న దొంగను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్లలో నివాసం ఉండే పత్తి అథర్స్ సులభంగా డబ్బు సంపాదనకు ఆశ పడ్డాడు. స్నేహితులతో కలసి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో ఇటీవల మారుతీనగర్ కొర్లగుంటకు చెందిన బాలరాజు శేషాద్రిరాజు తన ఆటోను ప్రశాంత్ స్కూల్ పక్కన ఆపాడు. దీనిని గమనించిన అథర్స్ ఆ ఆటోను వైర్లు కట్ చేసి స్టార్ట్ చేసి తీసుకెళ్లాడు. నాలుగు రోజులుగా రేణిగుంట చుట్టు పక్కల ఆ ఆటో నడుపుతున్నాడు. అదే సమయంలో ఈ ఆటోను విక్రయించడానికి చేసిన అతడి ప్రయత్నం విఫలమైంది. దీంతో శుక్రవారం ఆటోను తీసుకుని చడీ చప్పుడు లేకుండా చింతలచేను సమీపంలోని కళ్యాణ మండపం వద్ద ఉంచి తిరుగుతున్నాడు. కాగా, ఆటోల దొంగతనాలపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది నిఘా ఉంచారు. వీరికి అందిన సమాచారం మేరకు సీఐ నేతృత్వంలో పోలీసులు అతడిని పట్టుకుని అరెస్టు చేశారు. అతడి నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

ఆగస్టు1 నుంచి.. ఆన్‌లైన్‌లో మాత్రమే దివ్యానుగ్రహ విశేష హోమం టికెట్లు

తిరుమల, జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో టీటీడీ ప్రతి రోజు నిర్వహించే శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహం టికెట్లను ఆగస్టు1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో మాత్రమే విడుదల చేయనుంది. ప్రస్తుతం ప్రతిరోజు భక్తులకు కరెంట్ బుకింగ్ ద్వారా 50 టికెట్లు, ఆన్‌లైన్ ద్వారా 150 టికెట్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. భక్తుల విజ్ఞప్తి మేరకు ప్రస్తుతం కరెంట్ బుకింగ్‌లో ఇస్తున్న 50 టికెట్లను కూడా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ ప్రకటించింది. భక్తుల కోరిక మేరకు శ్రీవారి పాదాల వద్ద తమ శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామి అనుగ్రహం కోసం సంకల్పం చెప్పుకుని యజ్ఞం నిర్వహించేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈ విశేష హోమంలో రూ.1,600 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) పాల్గొనవచ్చు. హోమంలో పాల్గొన్న గృహస్తులకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 25(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 20వ డివిజన్ ఎమ్మార్‌పల్లెకు చెందిన పుష్పమికి రూ.3.39లక్షలు, 44వ డివిజన్ మధురానగర్‌కు చెందిన ఎ.లలితకు రూ.41వేలు చెక్కులను అందించారు. బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రవి, మునిప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల నిరసన



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వ సంస్థల పెన్షనర్స్ శుక్రవారం ఉదయం గాంధీ రోడ్డులోని నాలుగుకాళ్ల మండపం వద్ద నిరసన తెలిపారు. ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ ఇచ్చిన పిలుపుమేరకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి ప్లకార్డులు చేతబట్టి ర్యాలీగా నాలుగుకాళ్ల మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ నియమాలు 2025 బిల్లులో చేసిన సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. 8వ కేంద్ర వేతన సంఘం(సీపీఎస్) నిబంధనలను ప్రకటించాలని, చైర్మన్‌ను త్వరగా నామినేట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా నాయకులు, బ్రాంచ్ అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, సర్కిల్ ఆఫీసు బ్యారర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కింగ్‌డమ్ ట్రైలర్ ఈవెంట్‌ను రద్దు చేయాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా శనివారం నిర్వహించే కింగ్‌డమ్ సినిమా ట్రైలర్ విడుదల ఈవెంట్‌ను రద్దు చేయాలని నిమా నేత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరిప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాయదుర్గంలో నిర్వహించిన రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆదివాసీలను చులకన చేస్తూ మాట్లాడిన విజయ్ దేవరకొండ పాల్గొనే ఈవెంట్‌కు అధికారులు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు, మీడియా స్పందించాలన్నారు. ఈ సమావేశం లో శివకుమార్‌నాయక్, రవీంద్రనాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధ క్రీడాకారుడికి ఆర్థిక చేయూత



తిరుపతి(కలెక్టరేట్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గోల్బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన ముప్పాళ్ల శేషగిరి ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర అంధుల క్రీడా సంఘం అధ్యక్షుడు పెంచల నరసయ్య కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. ఈ విషయాన్ని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల దృష్టికి తీసుకురాగా ఆయన శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందించారు. రమేష్‌నాథ్ మాట్లాడుతూ దేశ కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

త్రిపుర గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం



తిరుపతి(కలెక్టరేట్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి శుక్రవారం పద్మావతి అతిథి గృహం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

నేడు పరమార్థదేవ్ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): హరిద్వార్‌కు చెందిన పతంజలి యోగా సమితి ముఖ్య కేంద్ర సమన్వయకర్త పరమార్థదేవ్ శనివారం తిరుపతికి రాన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆయన ప్రత్యేక ప్రసంగం, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు చెలికాని అన్నారావు భవన్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సాధన - సామవేద అంశంపై ఆయన ప్రసంగిస్తారు. యోగ విజ్ఞాన, యోగ సాంఖ్య విభాగం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

వాళ్లూ మనుషులే..!

స్త్రీ, పురుషులు కాని వారినీ గౌరవించడం మనుషుల కనీస ధర్మం

విభిన్న తాత్త్వికతను ప్రబోధించిన 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటకం



అమ్మ చెక్కిన బొమ్మ నాటకం



ఖడ్గ తిక్కన నాటకంలో దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుషులు కాని వారిని కూడా గుర్తించి గౌరవించాలని 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటకం ప్రబోధించింది. వాళ్లు కూడా మనుషులే అనే జ్ఞానాన్ని మనుషులంతా విధిగా తెలుసుకోవాలనే సందేశాన్ని ఈ నాటకం అందించింది. అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం హైదరాబాదుకు చెందిన గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో భీశెట్టి జ్యోతిరాజ్ రూపొందించిన 'అమ్మ చెక్కిన బొమ్మ' సాంఘిక నాటిక ప్రదర్శించారు. మనుషుల్లో మూడో వర్గాన్ని అస్పృహించుకోవడం, గౌరవించకపోవడం సమంజసం కాదని ఈ నాటకం తెలియజేసింది. స్త్రీ, పురుషులు కాని వారిని గుర్తించి గౌరవించే నాగరికత పెరగాలని ఈ నాటకం తెలియజెప్పింది. ఈ నాటకాన్ని భీశెట్టి జ్యోతిరాజ్ రాశారు. దర్శకులుగా గోవాడ వెంకట్ వ్యవహరించారు.

యుద్ధంతో అనర్థమేనని తేల్చిన 'ఖడ్గ తిక్కన'

యుద్ధం వల్ల జరిగే అనర్థాలను ఖడ్గ తిక్కన నాటకం తేల్చి చెప్పింది. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసాయిబాబా నాట్యమండలి వారు ఈ పద్య నాటకాన్ని ప్రదర్శించారు. యలమంచిలి సంస్థానాధీశుడు కాటమరాజుకు చెందిన గోవులు క్షామంతో మేతకు నోచుకోలేని పరిస్థితిలో ఉంటాయి. పాకనాటి సంస్థానాధీశుడైన సిద్ధిరాజు వద్దకు తన అనుచరులను పంపుతాడు. పాకనాడు సంస్థానంలో ఆవులను మేతకు పంపి పోషించే క్రమంలో ఇరు సంస్థానాధీశుల మధ్య సంఘర్షణ జరుగుతుంది. అయితే, యలమంచిలి సంస్థానాధీశుడు బ్రాహ్మణులను యుద్ధంలోకి ప్రవేశపెడతాడు. పాకనాటి సంస్థానాధీశులు తాము బ్రాహ్మణులతో యుద్ధం చేయమని, కడకు నిరాయుధులుగా నిలబడతామని చెబుతారు. సహాయం చేసిన వారినే నమ్మకద్రోహం చేయడం చేస్తారు. ఈ దశలో ఇరు వర్గాలకు చెందిన వారు ఈ యుద్ధంలో కడతేరుతారు. యుద్ధం ద్వారా ఎలాంటి మంచి జరగకపోగా, చెడు జరుగుతుందనే సందేశాన్ని ఖడ్గ తిక్కన నాటకం అందించింది. రచన, దర్శకులుగా పీవీఎన్ కృష్ణ పని చేశారు.

అలరించిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు

అభినయ ఆర్ట్స్ 25వ వార్షిక జాతీయస్థాయి నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. పలువురు సంకీర్తనాచార్యుల కీర్తనలు, జానపద గేయాలకు అనుగుణంగా పలువురు కళాకారులు అత్యద్భుత నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు.

కళా రంగంలో మహిళలు రాణించాలి

మహతి వేదికపై అభినయ ఆర్ట్స్ నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మహిళా వేదిక పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మావతి డిగ్రీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధి గంగవరపు శ్రీదేవి, పద్మావతి డిగ్రీ కాలేజీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కొణిదల శోభ, హైదరాబాదుకు చెందిన సాహిత్యవేత్త ఏనుగ గీతను అభినయ ఆర్ట్స్ సత్కరించింది. నాటక కళా రంగంలో మహిళలను అభినయ ఆర్ట్స్ ప్రోత్సహిస్తోందని వారు కొనియాడారు.

గాయని వాణికి స్వర మాధురి పురస్కార ప్రదానం

తిరుపతికి చెందిన ప్రముఖ గాయని వాణికి స్వర మాధురి పురస్కారాన్ని ప్రదానం చేశారు. గాన కళా రంగంలో వాణి కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. వాణి దంపతులను శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో నిర్వాహకులు సత్కరించారు.









వాణి దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నర్సింగ్ కోర్సు శిక్షణను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాలకు చెందిన మహిళా నర్సింగ్ అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగావకాశాల కోసం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన మహిళా అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకు అవసరమైన శిక్షణను సంవత్సరం పాటు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, డీఆర్వో నరసింహులు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

మౌని పుస్తకాల ఆవిష్కరణ



మౌని సాహిత్యం-ఆధ్యాత్మికత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): రచయిత మౌని సాహిత్యంపై వెలువడిన రెండు విమర్శనా గ్రంథాలను ఎస్వీయూ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. మౌని సాహిత్యం-ఆధ్యాత్మికత పుస్తకాన్ని వీసీ అప్పారావు, మౌని సాహిత్యం-సామాజికత పుస్తకాన్ని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూలో చదివి, టీటీడీలో ఉద్యోగం చేసి, రచయితగా ఎదిగిన మౌని అభినందనీయులని అన్నారు. అనేక ప్రక్రియల్లో 50 పుస్తకాలు రాయడం గొప్ప విషయమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ మౌని గొప్ప సాహిత్య సృష్టించారని కొనియాడారు. రచయిత మౌని మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉద్యోగం చేయలేదనే కొరత ఈ పుస్తకాల ఆవిష్కరణతో తీరిందన్నారు. కాగా, మౌని సాహిత్యం-ఆధ్యాత్మికత పుస్తకాన్ని ఆముదాల మురళి, మౌని సాహిత్యం-సామాజికత పుస్తకాన్ని కొండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి రాశారు.

చిత్రలేఖన పోటీల్లో బధిర పాఠశాల విద్యార్థుల ప్రతిభ



తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బధిర పాఠశాల విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో రాణించి భళా అనిపించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి పర్యవేక్షణలో ప్లాస్టిక్ రద్దు అనే అంశంతో సీనియర్స్‌కు, భూమాతను కాపాడుకుందాం అనే అంశంతో జూనియర్స్‌కు, జాతీయజెండా అనే అంశంతో సబ్ జూనియర్స్‌కు శుక్రవారం పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరించారు. ఆగస్టు 15వ తేదీన వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆ కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు.



వైభవంగా అష్టలక్ష్మీ వైభోగ వ్రతం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రామచంద్ర పుష్కరిణి వద్ద అష్టలక్ష్మీ వైభోగ వ్రతం అత్యంత వైభవంగా సాగింది. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో సత్యనారాయణ స్వామీజీ, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళమ్మ, శ్రీవారి సేవా ట్రస్టు ప్రతినిధి, విశ్వహిందూ పరిషత్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర, సర్వస్తోత్రనిధి గ్రూప్ ప్రతినిధి ప్రసన్నలక్ష్మి, అలిపిరి పాదాల గ్రూప్ ప్రతినిధి గీతాంజలి నేతృత్వం వహించారు. భక్తులకు అభయహస్త గోవింద సేవా మండలికి చెందిన చంద్రమౌళి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

28న టీటీడీ పాఠశాలల్లో 'సద్గమయ'

తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 28 నుంచి నాలుగు రోజుల పాటు (రోజుకు గంట పాటు) 'సద్గమయ' శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతుల డే స్కాలర్ల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విలువలు, నైపుణ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, వాస్తవ ప్రపంచాన్ని అధ్యయనం చేయడం, వ్యక్తిగత పురోగతి, సామరస్యం, సమాజంలో భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై నిష్ణాతులతో శిక్షణ ఇస్తారు.

మహావజ్రేశ్వరీదేవి అభయం

తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో కొలువైన అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ప్రత్యంగిరా, వారాహి సహిత అమ్మవారిని చందనంతో కూడిన మహావజ్రేశ్వరీదేవిగా అలంకరణ చేపట్టారు. నైవేద్యం సమర్పించి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పీసీ రాయలుకు పలువురి శుభాకాంక్షలు



అన్నదానం చేస్తున్న పీసీరాయలు, బీజేపీ నాయకులు

తిరుపతి అర్బన్, జూలై 25: ప్రముఖ పారిశ్రామికవేత్త, కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్ డాక్టర్ పి.సి.రాయలు జన్మదినం సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఉదయం శిల్పారామం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీటీడీ అన్నదాన ట్రస్టుకు రూ.10లక్షలు విరాళంగా అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందజేశారు. మధ్యాహ్నం గాంధీ రోడ్డులోని కస్తూర్బా కేంద్ర ట్రస్టు కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డుసభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ హాజరయ్యారు. రాత్రి కచ్చపి ఆడిటోరియంలో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, అలనాటి సినీనటి నిరోష పాల్గొన్నారు.

నేడు, రేపు టేప్ ఎక్స్‌పో

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర ప్రజలకు భవన నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శని, ఆదివారాలు టేప్ (ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్) ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ వెంకటేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ వరప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరవుతారని పేర్కొన్నారు. భవన నిర్మాణంపై పేద, మధ్య తరగతి వారికి నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు.

మార్కెట్లోకి కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం ఎండీ జగన్నాథరెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కియా సంస్థ మొదటిసారిగా సరికొత్త ఆవిష్కరణలతో కారెన్స్ క్లావిస్ ఈవీ కారును మార్కెట్లోకి తీసుకొచ్చింది. దామినేడు సమీపంలోని హోషి ఆటో ప్రైవేటు లిమిటెడ్ కియా షోరూంలో శుక్రవారం రాత్రి ఈ కారును షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో ఈ కారును తయారు చేసినట్లు చెప్పారు. ఒకసారి బ్యాటరీ చార్జ్ చేస్తే 490 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపారు. ఎక్స్‌షోరూం ధర రూ.17.99 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. 4 వేరియంట్లలో లభ్యమవుతుం దన్నారు. డైరెక్టర్లు చెరుకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి, షోరూం ప్రతినిధులు, ఖాతాదారులు పాల్గొన్నారు. కారు బుకింగ్ కోసం 8688829739ను సంప్రదించాలన్నారు.

ఘనంగా నారా రోహిత్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు నారా రోహిత్ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సినీ రంగంలో రోహిత్ రాణించాలని టీఎన్ఎస్ఎఫ్ నేతలు గంగాధర్, రాఘవేంద్ర, లారెన్స్ ఆకాంక్షించారు.

ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్ని తిరుపతి కేంద్రంగా విచారించే ప్రత్యేక కోర్టు (ఏడీజే కోర్టు)కు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది ఎ.అమర నారాయణ నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ఆయన నియామకానికి సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అమరనారాయణను మూడేళ్లపాటు ఎస్‌పీపీగా నియమిస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలు వీడండి

- సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు -



తిరుపతి(ఆటోనగర్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల వినియోగదారులపై భారం పడదని, వినియోగదారులే విద్యుత్ బిల్లులు నియంత్రించుకోవచ్చని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు అపోహలు వీడాలని పేర్కొన్నారు. ఈ మీటర్ల వల్ల మరింత పారదర్శకత ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగాఅన్ని రాష్ట్రాల్లో ఈ మీటర్లు అమర్చుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఈఆర్సీ) 2021 ఫిబ్రవరిలో మీటర్లు అమర్చడానికి అనుమతులు మంజూరు చేసిందని, సంస్థ పరిధిలోని ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. స్మార్ట్ మీటర్లు అమర్చిన అనంతరం బిల్లుల్లో అదనపు చార్జీలు విధించేది లేదని తెలిపారు. వినియోగదారులకు అనుమానాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రి పంకజ గోపీనాథ్ ముండే, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఉన్నారు.



సతీష్‌రెడ్డి

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


బుధవారం హుండీ ఆదాయం: రూ.4.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,838

తలనీలాలు సమర్పించినవారు: 22,212



అందమైన అవ్వాచారికోన లోయ



అవ్వాచారి కోన

● ఆత్మహత్యాయత్నాలకు మళ్లీ నిలయం

తిరుమల, జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని అవ్వాచారికోన లోయ మళ్లీ ఆత్మహత్యాయత్నాలకు నిలయంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కొంతమంది, స్వామి సన్నిధిలో ఆత్మహత్య చేసుకుంటే వైకుంఠప్రాప్తి లభిస్తుందని మరికొంత మంది ఇలా అనేక మంది ఆత్మహత్యలు చేసుకునేందుకు ఘాట్‌రోడ్డులోని అవ్వాచారి కోనలోయలో దూకిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్టే అనిపించినా తాజా ఘటనలతో మళ్లీ తిరిగి పెరుగుతున్నాయనిపిస్తోంది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని మోకాళ్లమెట్టు ప్రాంతం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకున్న రోడ్డుకు ఎడమవైపు అతిభారీ లోయ ఉంది. ఇదే మార్గంలో అలిపిరి కాలినడకభక్తుల మార్గం కూడా కలుస్తుంది. ఈలోయ కొందరికి ప్రకృతి అందాలను పంచే ప్రాంతంగా ఉంటే మరి కొందరికి ఆత్మహత్యలు చేసుకునేందుకు అనువుగా మారింది. ఐదేళ్ల క్రితం వరకు అవ్వాచారికోన లోయలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారి సంఖ్య అధికంగా ఉండేది. 2010 సెప్టెంబరులో ఈలోయలోకి దూకిన యువతిని మూడురోజుల పాటు గాలించి ప్రాణాలతో కాపాడారు. 2012లోనూ రంగస్వామి అనే యువకుడు కూడా ఇలానే లోయలో పడిపోయాడు. తాను చనిపోయేలా ఉన్నానని, కాపాడాలంటూ అతనే ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. భద్రతా సిబ్బంది అతడ్ని గుర్తించి లోయనుంచి పైకి తీసుకువచ్చేలోపు మృతి చెందాడు. 2018లో కూడా నీరజ అనే యువతి ఆత్యహత్యకు యత్నించింది. వీడియో కాల్ ద్వారా ఆమె ప్రమాదంలో ఉందని గుర్తించి తిరుమల పోలీసులు లోయలోకి దిగి రక్షించారు. 2009 నుంచి 2012 మధ్యలో దాదాపు ఎనిమిది మంది అవ్వాచారి కోనలోయలో మృతి చెందారు. 2018 తర్వాత నిరంతరాయంగా భద్రతాసిబ్బంది నిఘా, భక్తుల రాకపోకలు అధికంగా ఉండటం, తిరుమలలో ఆత్మహత్యలకు పాల్పడితే పాపం అంటూ అర్చకుల నుంచి ప్రకటనలు రావడంతో చాలా వరకు ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య తగ్గింది.

లోయ వద్ద ప్రమాదకరంగా ఫొటో షూట్‌లు



తాజాగా మరో రెండు ఘటనలు

● గతనెల మార్చి నెలలో సిద్దారెడ్డి అనే వ్యక్తి అక్కగార్ల ఆలయానికి సమీపంలోని లోయలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో హరిబాబు అనే భక్తుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాదాపు మూడురోజుల పాటు గాలించినా ఆ భక్తుడి ఆచూకీ లభించలేదు. కొద్దినెలల తర్వాత ఆ వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● వారం కిందట (బుధవారం) ఆళ్లగడ్డ వాసి మాధవరాయుడు అనే మరో డ్రైవర్ కూడా ఆత్మహత్య చేసుకునేందుకు లోయలోకి దూకేశాడు. అదృష్టవశాత్తు భక్తులు ఇచ్చిన సమాచారంతో గంటల వ్యవధిలోనే భక్తుడిని భద్రతా సిబ్బంది కాపాడారు.

ఏవీ జాగ్రత్తలు?

కాలినడకన అలిపిరిలో బయలుదేరిన భక్తులందరూ తిరుమలకు చేరుకుంటున్నారా అనే రికార్డులేవీ భద్రతాసిబ్బంది వద్ద ఉండవు. మార్గం మధ్యంలో ఏం జరిగిన తెలుసుకునే పరిస్థితీ లేదు. అలిపిరి నుంచి తిరుమలకు వరకు సీసీ కెమరాల నిఘా కూడా తక్కువే. ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకునేందుకు ఎవరో దూకారంటూ భక్తులు సమాచారమిస్తే తెలిసవే తప్పా నిఘాతో గుర్తించినవి లేవీ లేవు. ఇతర భక్తులు చూడకుండా లోయలో దూకితే గుర్తించే అవకాశమే లేదు. నడకమార్గానికి పక్కనే లోయ ఉన్న క్రమంలో ఆత్మహత్యలకు అనువుగా మారుతోంది. మరోవైపు లోయ ప్రాంతానికి సంబంధం లేకుండా కూడా కాలినడకమార్గంలోనూ అనేక ఆత్మహత్యలు జరిగాయి. ఇందులో ప్రధానంగా 2022 ఆగస్టులో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు ఏడో మైలు వద్ద బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే ఏడాది అక్టోబరు నెలలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి అనే యువకుడు గాలిగోపురం వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈక్రమంలో ఇప్పటికైనా టీటీడీ భద్రతా విభాగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. లోయకు, కాలినడకమార్గానికి మధ్య ప్రస్తుతం కొంతమేరకే ఇనుపకంచె ఉంది. భక్తుల్వెరు లోయలోకి దూకకుండా,లేదా సెల్ఫీల ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోకుండా మిగిలిన ప్రాంతం లోనూ కంచెను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అలాగే నడకమార్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా అవసరం. వీటితో పాటు భద్రతా సిబ్బందితో నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా పెంచాలి. అలిపిరిలో మొదలైన భక్తులు తిరుమలకు చేరుతున్నారా లేదా అని తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఇవన్నీ చేస్తే తప్పా ఆత్మహత్యయత్నాలు తగ్గవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.3 లక్షల జరిమానా



నిందితులతో పోలీసులు

పిచ్చాటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు శుక్రవారం తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టు జడ్జి నరసింహమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధించారు. పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు... 2018 డిసెంబరు 25న అప్పటి ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో మండలంలోని రెప్పాలపట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నుంచి రెండు కార్లు చెన్నైవైపు వెళ్తుండగా నిలిపి తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో 44 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించారు. వాహనాలు సహా ఎర్రచందనం దుంగలను స్టేషన్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లా శంకరాపురానికి చెందిన ఎం.భాస్కర్, చెంబరంబాక్కానికి చెందిన వుగ ఎంతి, మేట్ స్ట్రీట్‌కు చెందిన ప్రభు, కొన్నికుప్పానికి చెందిన హుస్సేన్‌ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో సత్యవేడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టులో ట్రయల్ జరుగుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణ నాయుడు వాదనల మేరకు నిందితులకు శిక్ష ఖరారైంది. కాగా స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ వెంకటరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వీఆర్‌కు పుత్తూరు సీఐ



పుత్తూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీఐ సురేంద్రనాయుడిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పనితీరు మొదటి నుంచి వివాదాస్పదమవుతూనే ఉంది. బియ్యం అక్రమ వ్యాపారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మద్యం వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్ల విషయంపై ఎస్పీకి ఫిర్యాదులందాయి. వీటన్నింటిపై ఎస్పీ ప్రత్యేక సిబ్బంది ద్వారా విచారణ చేయించి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను వీఆర్‌కు పంపారు. రెండునెలల క్రితం అవినీతి ఆరోపణల నేపథ్యంలో హెడ్ కానిస్టేబుల్‌నూ వీఆర్‌కు పంపించిన విషయం తెలిసిందే.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని తిరుపతి వెస్ట్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన హరికృష్ణ, ఆకాష్, అరుణకుమార్ ఒడిశాలోని నితిన్ ద్వారా గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. సీఐకి అందిన సమాచారం మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, సిబ్బంది నరసింహతీర్థం వద్ద కాపుకాచి పట్టుకున్నారు. మూడు బ్యాగుల్లోని 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నితిన్ కోసం గాలిస్తున్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు 15న 14వేల గృహ ప్రవేశాలుచేసే లక్ష్యంతో నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ ఎం.శివప్రసాద్ ఆదేశించారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో గృహ నిర్మాణాల పురోగతిపై శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. అంతకు ముందు ఏర్పేడు మండలం చిందేపల్లి, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ లేఅవుట్లను ఆయన పరిశీలించారు.

15 నాటికి పీ4 మొదటి దశ అమలు కావాలి

ఆగస్టు 15 నాటికి పీ4 కార్యక్రమం మొదటి దశ అమలు కావాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి ఆయన వర్చువల్ విధానంలో సమీక్షించారు. ప్రతి అధికారీ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని సూచించారు.

→ పల్లకిలో స్వామికి హారతులు

కుమారస్వామికి పల్లకీసేవ



శ్రీవల్లీ, దేవసేన

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం ముక్కంటి ఆలయంలో పల్లకీసేవ కనుల పండువగా సాగింది. వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి పల్లకీలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

● ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచార నిందితుడు

సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు



సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడు.. శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు. రైల్వే స్టేషన్ వద్ద ఇతడిని ఆరంబాక్కం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆరంబాక్కంలో ఈ నెల 12వ తేది సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న నాలుగో తరగతి చదివే బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులో కలకలం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు సైతం ఆందోళన చేశాయి. ఈ క్రమంలో తిరువళ్లూరు ఎస్పీ వివేకానంద శుక్లా 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఘటన జరిగిన రోజు నిందితుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. నిందితుడి ఎవరెవరితో మాట్లాడాడనే వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు పలు ప్రాంతాల్లో.. లోకల్ మెమో రైళ్లలో తిరిగే ఫొటోలను పోలీసులు గుర్తించారు. ఈ ఫొటోలను 22వ తేదీన ఆరంబాక్కం పోలీసులు విడుదల చేశారు. ఇతడి ఆచూకీ చెబితే రూ.5 లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించారు. సూళ్లూరుపేట, తడ, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి.. మూడు రోజులుగా విస్తృతంగా గాలిస్తున్నారు. ముఖ్యంగా గుమ్మడిపూడి నుంచి సూళ్లూరుపేట వరకు రైల్వే స్టేషన్లలో దృష్టి పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారం వద్ద తిరుగుతున్న నిందితుడిని ఆరంబాకం పోలీసులు చాకచక్యంతో పట్టుకుని తీసుకెళ్లారు. శనివారం తమిళనాడులో అరెస్టు చూపే అవకాశం ఉంది.

● భార్య, బిడ్డలను చంపిన

నిందితుడి అరెస్ట్



నిందితుడు గిరిని అరెస్ట్ చేసిన పోలీసులు

పాకాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు బిడ్డలను బావిలోకి తోసి హతమార్చిన నిందితుడు టి.గిరిని పోలీసులు అరెస్టు చేశారు. పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన గిరికి, చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన హేమంతకుమారితో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి తనుశ్రీ (11), తేజశ్రీ (7) కుమార్తెలు. పదేళ్లుగా వీరు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ప్రకాశం పార్కు మునిసిపల్ స్కూల్ వద్ద హేమంతకుమారి పండ్లదుకాణం నిర్వహిస్తుండగా, గిరి ఎలక్ట్రీషిన్‌గా పనిచేసేవాడు. పుట్టింటినుంచి భూమి అమ్మి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. లేదంటే చంపేస్తానంటూ బెదిరించేవాడు. అప్పుడప్పుడు కొంత డబ్బులు తెచ్చినా తృప్తి పడలేదు. భూమి అమ్మి పెద్దమొత్తంలో తీసుకురాలేదనే కోపంతో భార్యాబిడ్డలను చంపాలని నిర్ణయించుకున్నాడు. తిరుపతి నుంచి భార్యా పిల్లలతో అక్క ఇంటికి వచ్చాడు. అక్కడ్నుంచి స్వగ్రామం ఓబుల శెట్టివారిపల్లెలోని పెద్దహరిజనవాడకు వచ్చాడు. ఈనెల 17వ తేదీన తిరుగు ప్రయాణంలో మద్దినాయనిపల్లె- కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డులో కొత్తవడ్డిపల్లె ఊట్ల బావిదగ్గర చేపలు చూద్దామని నమ్మకంగా తీసుకెళ్లాడు. బావిలో చేపలు చూపిస్తున్నట్లు నటిస్తూ.. భార్య, ఇద్దరు పిల్లలను తోసి చంపేశాడు. ఇంతలో సమీపంలోని వారు అటు రావడంతో గొంతు కోసుకున్నట్లు నటించి పారిపోయాడు. నిందితుడికోసం గాలించి.. గురువారం సాయంత్రం అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ చెప్పారు.

హెడ్‌మాస్టర్ మందలించారని..

● అనంతపురం నుంచి తిరుమల చేరుకున్న నలుగురు విద్యార్థులు
● గుర్తించి అప్పగించిన పోలీసులు



పారిపోయి వచ్చిన విద్యార్థులు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెడ్‌మాస్టర్ మందలించారని పారిపోయి తిరుమల చేరుకున్న నలుగురు అనంతపురం విద్యార్థులను తిరుమల పోలీసులు తిరిగి వారి కుటుంబాలకు అప్పగించారు. అనంతపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ పొట్టి శ్రీరాములు నేతాజీ స్కూల్‌లో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులను సరిగా చదవడంలేదని హెడ్ మాస్టర్ మందలించారు. టీసీలు ఇచ్చి పంపేస్తానని హెచ్చరించాడు. గురువారం స్కూల్ నుంచి వీరు తిరిగి రాకపోవడంతో హాస్టల్ వార్డన్ అనంతపురం 3వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా వీరు తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం తిరుమల పోలీసులకు బాలుర ఫోటోలు పంపారు. వెంటనే అప్రమత్తమైన కమాండ్ కంట్రోల్, విజిలెన్స్, ట్రాఫిక్, బీట్ సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు బాలురు అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల నుంచి తిరుపతికి వెళుతున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సాయంత్రం అనంతపురం పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించి పిల్లలను గుర్తించిన తిరుమల పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం...

ఏపీఐఐసీ భవనం పరిశీలన



వికృతమాల వద్ద ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలిస్తున్న ఐఏఎస్ సూర్యతేజ, జిల్లా అధికారులు

ఏర్పేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ శాశ్వత భవనం కోసం ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలించారు. వాస్తవానికి ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 19న సీఎం చంద్రబాబు ప్రారంభించాల్సి ఉంది. అయితే సీఎం షెడ్యూల్‌లో మార్పులతో ప్రారంభంకాలేదు. ఇదిలా ఉండగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు శాశ్వత భవనం కోసం ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) ఎండీ సూర్యతేజ అధికారులతో కలిసి వికృతమాల సమీపంలో ఉన్న ఏపీఐఐసీ నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం రేణిగుంట మండలంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, పలువురు ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

● ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

సత్యవేడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలైజాకీ అధికారుల బృందంతో శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ చైర్మన్ ఆర్.శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధిని వివరించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాల్లో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ గమ్యస్థానం అన్నారు. శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమ (ఆస్ట్రేలియా ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ) దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రపంచ శ్రేణి మెట్రో రైళ్లను తయారు చేసే ఆల్‌స్టామ్ కంపెనీ మొట్టమొదటి పూర్తిస్థాయి ఆటోమోటెడ్ మెట్రో రైళ్లను సిడ్నీ మెట్రోకు సరఫరా చేయడం ఇండియా - ఆస్ట్రేలియా పారిశ్రామిక సహకారంలో మైలురాయిగా సన్నారెడ్డి అభివర్ణించారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ భారత్‌లో అత్యుత్తమ వ్యాపార కేంద్రాల్లో శ్రీసిటీ ఒకటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

ఈ పర్యటనలో కీలకాంశంగా కాన్సుల్ జనరల్ సిలైజాకీ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు శ్రీసిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్‌లను నిల్వచేసే అధిక పీడన ట్యాంకులను ఈకంపెనీ తయారు చేస్తుంది.



ఎంఓయూ మార్చుకుంటున్న కాన్సుల్ జనరల్, శ్రీసిటీ ఎండీ

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

నలుగురికి స్వల్పగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నాయుడుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద అదుపుతప్పి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విశాఖపట్నానికి చెందిన శ్రీనాథ్, ఆయన సతీమణి, ఇద్దరు పిల్లలు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నాయుడుపేట వద్ద వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయిన కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ దంపతులతో పాటు ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కారు ముందుభాగం దెబ్బతింది.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం బాధ్యతగా భావించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు అరణ్య కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం సమాజ శ్రేయస్సుకు పునాదిలాంటిదని, ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫీర్ కుమార్, విజయ మహేష్, నారాయణరాజు, కోటేశ్వరరావు, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ, రూఫ్సీరాణి, శైలజ, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని వెంకటగిరి సీఐ రమణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఫ్యాషన్ కోసం డ్రగ్స్ వినియోగిస్తూ క్రమంగా బానిసలుగా మారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కూడా ర్యాగింగ్ చేస్తున్నారని, అలాంటి అలవాట్లు మార్చుకుని మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. ఇక ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటివి జరిగినప్పుడు 112 ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని వెంగమాంబపురం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గోపి మాట్లాడుతూ బాలికల భద్రత, చెడు వ్యసనాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దేశానికి ఇస్రో సహకారంపై సెమినార్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పీఆర్ఎల్ డైరెక్టర్ భరద్వాజ్ తదితరులు

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన హిందీలో సాంకేతి సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఆర్ఎల్ డైరెక్టర్ అనిల్ భరద్వాజ్ అభివృద్ధి చెందిన 'భారత దేశానికి ఇస్రో సహకారం, సౌర వ్యవస్థ అన్వేషణ' అనే అంశంపై హిందీలో వివరించారు. షార్ ఇన్-హౌస్ జర్నల్ ప్రజ్వల్ ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముద్ర, వ్యవసాయం, పొదుపు మహిళలకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మూడు మండలాల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రూపాల్లో అందించే రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందితేనే ప్రయోజనమన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకర్లు రుణాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీవో విజయకుమార్, ఏపీఎంలు ప్రసన్న కుమారి, రాజారెడ్డి, మునిరాజయ్య, సీసీలు ఉమాశంకర్, మునెయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. శుక్రవారం గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎస్సీ, ఎస్టీ పేదల అభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గురించి వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపునిచ్చి వారి ఎదుగుదలకు ఎమ్మెల్యే ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. వాకాడు మండలానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఎమ్మెల్యేపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ వెనుక వైపు ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వత్రపాలెం ప్రాంతానికి చెందిన కేశవుల శివ(52) తహసీల్దారు కార్యాలయం వెనుక ఉన్న కానుగచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మద్యానికి బానిసైన శివ కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడని, మూడు రోజుల నుంచి ఇంటికి కూడా వెళ్లలేదని తెలిసింది. మృతదేహాన్ని మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నిర్మాణంలో ఉన్న గురుకుల పాఠశాల భవనం - నిర్మాణానికి వాడుతున్న నాసిరకం కంకర, ఇటుకలు

నాసిరకంగా గురుకుల భవనాల నిర్మాణం

దొరవారిసత్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం బీసీ గురుకులంలో అదనపు గదుల నిర్మాణం నాసిరకంగా జరుగుతోంది. గురుకుల విద్యాలయంలో లైబ్రరీ, ల్యాబ్ రేటరీ కోసం ఐదు అదనపు గదులను నిర్మించేందుకు పీఎంశ్రీ పథకం కింద ప్రభుత్వం సుమారు రూ.కోటి మంజూరు చేసింది. ఆరు నెలల క్రితం పనులు చేపట్టిన కాంట్రాక్టరు పాత భవనంపై ఒక గదిని పూర్తి స్థాయిలో నిర్మించారు. మరో నాలుగు గదుల పనులు జరుగుతున్నాయి. రెండు గదులు కింద, మరో రెండు గదులు పైఅంతస్తులో నిర్మిస్తున్నారు. గోడలకు వాడుతున్న ఇటుకలు, స్లాబ్ పనులకు వినియోగిస్తున్న మెటల్ నాసిరకంగా ఉంటోంది. ఈ విషయాన్ని ఏఈ జనార్దన్‌ను దృష్టికి తీసుకెళ్లగా గదుల నిర్మాణానికి వాడుతున్న ఇటుకలు నాసిరకంగా ఉండడంతో వాటిని ఉపయోగించకుండా ఆపేశామని తెలిపారు. పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని జిల్లాలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నన్నపేట పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రూ.కోటి 80లక్షల వ్యయంతో నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ, గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లు, రూ.5 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటు, రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ గ్రామంలోనూ తట్టడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. వైసీపీ అధినేత జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనను గాడిలో పెట్టి అభివృద్ధిబాట పట్టించారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం 80 శాతం అమలు చేసిందన్నారు. ఆగస్టు 15నుంచి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. కాగా, సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో లేకపోవడంతో ఎంపీపీ తనూజా రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సభావేదిక పైకి వెళ్లేందుకు ఆమె నిరాకరించారు. గతంలోనూ ప్రొటో కాల్ ఉల్లంఘనకు పాల్పడి తనను అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల ఆమెకు నచ్చచెప్పడంతో సభా వేదికపైకి వచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, సీఐ రమణ, ఎస్ఐ ఎడుగొండలు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కూని సూరి, మురళి, నక్కల వెంకట్రామయ్య, శివ నారాయణ, జీకేపల్లి బాబు నాయుడు, నాయులు చలపతి నాయుడు, శేషాద్రి, మగ్గం వెకటాచలం తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇళ్ల పట్టాల పంపిణీ వాయిదా

తడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తడ మండలం పూడికుప్పానికి వలస వచ్చే ఇరకంకుప్పం గ్రామస్తులకు శుక్రవారం ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వర్షం కారణంగా వాయిదా పడింది. ఇరకం కుప్పం గ్రామస్తులకు పూడిక్కుప్పంలో ఇళ్ల పట్టాలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ఇచ్చేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గంటలకు ఈదురు గాలులతో కూడి భారీవర్షం కురవడంతో ఏర్పాటు చేసిన వేదిక కూలిపోయింది. దీంతో గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో కార్యక్రమం నిర్వహించి పట్టాలు అందించాలని అనుకున్నారు. అయితే వాతావరణం సహకరించపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

అంధ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



శేషగిరికి చెక్కు అందజేేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ రమేష్‌నాథ్

వెంకటగిరి, జులై 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి చెందిన అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి ఇటీవల జరిగిన జాతీయ స్థాయి గోల్బాల్ పోటీల్లో ప్రతిభ చూపి సెప్టెంబరులో ఈజిప్టులోని అలెగ్జాండ్రియలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆయన విదేశీ ప్రయాణానికి అవసరమైన ఖర్చుల కోసం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల కలెక్టర్ వెంకటేశ్ చేతుల మీదుగా ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అంధుల క్రీడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య నాయుడు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యులు నరసింహులు, నారాయణ, పద్మనాభ మునిలక్ష్మి, అంకయ్య, బ్రైండ్స్ అసోషియేషన్ కార్యదర్శి రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు సహకారం



శ్రీనివాసులును సత్కరిస్తున్న స్థానికులు, సచివాలయ సిబ్బంది

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన, బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉద్యోగులతో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టేడు సహకార సంఘ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చిట్టేటి నాగూరయ్య, కసుమూరు వెంకటేశ్వర్లు, పసుపులేటి వేణు మాట్లాడుతూ ఉద్యోగులు పారదర్శక పాలన అందించాలని కోరారు. ఉద్యోగులు స్పందిస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చిట్టేడు సహకార సంఘ ఛైర్మన్ చాపల శ్రీనివాసులును గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది సత్కరించారు.

నష్టపరిహారం అందించాలని నిరసన

చిల్లకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాగమాల రోడ్డుకు ఇచ్చిన భూములకు నష్టపరిహారం అందించాలంటూ మండలంలోని తొణుమాల, ఉడతావారిపార్లపల్లి గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు నిర్మాణంలో తాము భూములు కోల్పోయామన్నారు. కొంతమందికి ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు రైతులతో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నెలరోజుల్లో నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుటామని హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

చెత్త తొలగించారు



రైల్వేగేటు వద్ద చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు దక్షిణవైపు రోడ్డులో ఇటీవల తొలగించిన అండర్ బ్రిడ్జి నిర్మాణానికి తెచ్చిన సిమెంట్ దిమ్మెలు ఉన్న చోట చెత్త పేరుకుపోయింది. మూడు రోజుల క్రిత సిమెంట్ దిమ్మెలు తొలిగించారే కానీ చెత్తను తొలగించ లేదు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం సిమెంట్ దిమ్మెలు తొలిగించారు.. చెత్తను తీయడం మరిచారు' శీర్షికన రావడంతో మున్సిపల్ కమిషన్ చిన్నయ్య స్పందించి పారిశుధ్య కార్మికులతో చెత్తను తొలిగింపజేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టనంలోని గాంధీనగర్‌కు చెందిన సంకీర్తన తిరుపతిలో నర్సింగ్ చదువుతోంది. విద్యార్థిని కళాశాల ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో టీడీపీ నాయకులు శుక్రవారం రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏసుపాక పెంచలయ్య, రావూరు సురేంద్ర పాల్గొన్నారు.

పీ4తో పేదరిక నిర్మూలన



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

పెళ్లకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన నుంచి రూపొందిన పీ4 కార్యక్రమంతో నిరుపేదల జీన ప్రమాణాలు మెరుగవుతాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు పంచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలం లోని 13 గ్రామ సచివాలయాల్లో పీ4 గ్రామసభలు నిర్వహించారు. చిల్లకూరు సచివాలయంలో జరిగిన గ్రామసభలో బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారి జాబితాను శివకుమార్ వెల్లడించారు. కార్యక్రమంతో పంచాయతీ కార్యదర్శులు సమ్మన శ్రీహరి, సుజాతమ్మ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కారు మబ్బులు కమ్ముకుని చల్లగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా నల్లని మబ్బులు కమ్మి ఈదు రు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండు, హోలీక్రాస్ సమీపంలో జీఎన్ టీ రోడ్డు, స్టేట్‌బ్యాంక్ రోడ్డులో వర్షపునీరు నిలిచింది.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆ 20మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

28న టీటీడీ పాఠశాలల్లో 'సద్గమయ'

తిరుపతి అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈనెల 28 నుంచి నాలుగు రోజుల పాటు (రోజుకు గంటపాటు) 'సద్గమయ' శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతుల డే స్కాలర్ల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విలువలు, నైపుణ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, వాస్తవ ప్రపంచాన్ని అధ్యయనం చేయడం, వ్యక్తిగత పురోగతి, సామరస్యం, సమాజంలో భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై నిష్ణాతులతో శిక్షణ ఇస్తారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మీనాక్షి సుందరి

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి కోరారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్, న్యాయవాదులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వెలుగు ఏపీఎం అనీలా అన్నారు. కోటలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోఏలు, సీసీలతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు రుణాల చెల్లింపుల్లో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా సంఘాల వారీగా ఉన్న లక్ష్యాలపై నివేదికలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, శంకర్, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ నైపుణ్యాలపై ముగిసిన శిక్షణ

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 6 వారాలుగా జరిగిన డిజైన్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. బెంగళూరుకు చెందిన డైనమిక్ ఇంజనీరింగ్ సర్వీస్ అధిపతి నాగార్జున పాల్గొని డిజైన్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాస్టింగ్ వంటి విభాగాల్లో డిజైనింగ్‌కు కావాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రసంశాపత్రాలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిపాల్గొన్నారు.

శ్రావణమాస ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలే రమ్మ ఆలయంలో శ్రావణ మాస మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 100 చీరలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నర్సింగ్ కోర్సు శిక్షణను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాలకు చెందిన మహిళా నర్సింగ్ అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగావకాశాల కోసం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన మహిళా అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకు అవసరమైన శిక్షణను సంవత్సరం పాటు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, డీఆర్వో నరసింహులు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

మౌని పుస్తకాల ఆవిష్కరణ



మౌని సాహిత్యం-ఆధ్యాత్మికత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): రచయిత మౌని సాహిత్యంపై వెలువడిన రెండు విమర్శనా గ్రంథాలను ఎస్వీయూ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. మౌని సాహిత్యం-ఆధ్యాత్మికత పుస్తకాన్ని వీసీ అప్పారావు, మౌని సాహిత్యం-సామాజికత పుస్తకాన్ని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూలో చదివి, టీటీడీలో ఉద్యోగం చేసి, రచయితగా ఎదిగిన మౌని అభినందనీయులని అన్నారు. అనేక ప్రక్రియల్లో 50 పుస్తకాలు రాయడం గొప్ప విషయమన్నారు.

వైభవంగా అష్టలక్ష్మీ వైభోగ వ్రతం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రామచంద్ర పుష్కరిణి వద్ద అష్టలక్ష్మీ వైభోగ వ్రతం అత్యంత వైభవంగా సాగింది. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో సత్యనారాయణ స్వామీజీ, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళమ్మ, శ్రీవారి సేవా ట్రస్టు ప్రతినిధి, విశ్వహిందూ పరిషత్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర, సర్వస్తోత్రనిధి గ్రూప్ ప్రతినిధి ప్రసన్నలక్ష్మి, అలిపిరి పాదాల గ్రూప్ ప్రతినిధి గీతాంజలి నేతృత్వం వహించారు. భక్తులకు అభయహస్త గోవింద సేవా మండలికి చెందిన చంద్రమౌళి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

హోంమంత్రి అనితకు సాదర స్వాగతం



రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు సాదర స్వాగతం లభించింది. శుక్రవారం శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి వందే భారత్ రైల్లో విజయవాడ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్‌కు రాత్రి చేరుకున్నారు. ఆమెకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, తదితర పోలీస్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

అమరా హాస్పిటల్‌లో వరల్డ్ బ్రెయిన్ డే



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రమాదేవి తదితరులు

రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని అమరా హాస్పిటల్ చైర్మన్ ప్రసాద్ గౌరినేని, ఎండీ రమాదేవి సూచించారు. మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమరా హాస్పిటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోజూ వ్యాయామం, యోగా, మనసుకు నచ్చిన పని చేస్తే ఒత్తిడి ఉండదన్నారు. ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్, విటమిన్స్ సరైన మోతాదులో తీసుకోవడం మంచిదన్నారు. ముఖ్యంగా ఆల్కహాల్, సిగరెట్, ఇతర వ్యసనాలను దూరంగా ఉండి సామాజిక సంబంధాల్ని పెంపొందించుకోవాలన్నారు. ముఖ్య అతిథులు డీఎం హెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఈఎస్‌ఐ జేడీ రాధాకృష్ణ, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ ఆర్ఆర్‌రెడ్డి న్యూరో సమస్యలపై ప్రసంగించారు. అనంతరం అమరా హాస్పిటల్‌లో న్యూరో సమస్యలకు సంబంధించి అందు బాటులో ఉన్న అత్యాధునిక సేవలను వివరించారు. హాస్పిటల్ సీవోవో భాగ్యలక్ష్మి, శ్రీధర్, న్యూరాలజీ హెచ్‌వోడీ ఆనంద్, డాక్టర్లు యశ్వంత్ సందీప్, విజయేంద్ర రెడ్డి, అనిల్‌బాబు, క్రిటికల్ కేర్ సిబ్బంది, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయానికి రూ.25లక్షల విరాళం



ఎమ్మెల్యే చేతులు మీదుగా చెక్కును అందుకుంటున్న ఆలయ అధికారులు

ఏర్పేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన త్రిమూర్తుల ఆలయం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే రూ.25లక్షలను ఎమ్మెల్యే సుధీర్ చేతులమీదుగా ఆలయానికి అందించారు. రూ.25లక్షలను ఎమ్మెల్యే గుడిమల్లం ఆలయ నిర్వహణ అధికారులకు ందించారు. మూడు నెలల క్రితం ఆలయాన్ని దర్శించచిన శ్రీకాంత్‌షిండే భక్తుల అన్నదాన భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం కొనుగోలుకు రూ.25 లక్షలు, భవన నిర్మాణానికి రూ.25 లక్షలు అందజేస్తానని తెలిపారు. ఈ మేరకు స్థలం కొనుగోలుకు రూ.25లక్షలను శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌కి పంపించారు. అన్నదాన సత్రానికి ఆలయం పక్కన ఉన్న ఇద్దరు రైతుల నుంచి ఎకరా స్థలాన్ని కొనుగోలు చేస్తామని ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు తెలిపారు.

బీజేపీ కమిటీ సభ్యులకు సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి జిల్లా కార్యవర్గంలో బాధ్యతలు స్వీకరించిన ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.డి. బాలాజీ, కె.గోపాల్, మునీశ్వరి, ఎల్.గోపాల్, యతీందర్ రెడ్డి, రమణారెడ్డిని శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సన్మానించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన గరికపాటి రమేష్ బాబును కూడా సత్కరించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని సూచించారు. హరీష్‌రెడ్డి, వి.కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ జాతర ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోటలో కొలువై ఉన్న చెంగాళమ్మ ఆలయ జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 28వ తేదీ వరకు ఈ జాతర జరగనుంది. ఈ క్రమంలో శుక్రవారం చెంగాళమ్మకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. మైలు ముగ్గు, శేషపాన్పు, గ్రామోత్సవం, పోతురాజు ముగ్గులను వేయనున్నారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా చెంగాళమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పిచ్చాటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతి చెందిన శరవణన్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండలంలోని వేలూరులో బుధవారం పడవేటమ్మ ఉత్సవం సందర్భంగా పందిళ్లు వేస్తుండగా 11 కేవీ వైరు తగిలి విద్యుదాఘాతంతో కె.శరవణన్ మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, మునిరత్నం నాయుడు, ఎస్.నాగరాజు, డిల్లీతో కలిసి ఎమ్మెల్యే మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

నాగలాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీపీ కోటకు చెందిన అక్బర్ బాషాకు రూ.75 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ఆదిమూలం అందించారు.

నర్సింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాలకు చెందిన మహిళా నర్సింగ్ అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగావకాశాల కోసం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన మహిళా అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకు అవసరమైన శిక్షణను సంవత్సరం పాటు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, డీఆర్వో నరసింహులు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

అంధ క్రీడాకారుడికి ఆర్థిక చేయూత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గోల్బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర అంధుల క్రీడా సంఘం అధ్యక్షుడు పెంచల నరసయ్య కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. ఈ విషయాన్ని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల దృష్టికి తీసుకురాగా ఆయన శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందించారు. రమేష్‌నాథ్ మాట్లాడుతూ... దేశ కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన

పుత్తూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వాలంబన సాధ్యమవుతుందని జన శిక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు. రాస్ స్థానిక ప్రాంతీయ శాఖ కార్యాలయంలో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణను ప్రారంభించారు. టైలరింగ్ పనిముట్లు, బ్యూటీషియన్ కోర్సుకు అవసరమైన వస్తువులను ఉచితంగా అందించారు. హరి, రవి, తేజ, జయంతి, ధన, హమీషా పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం: సీపీఎం

పుత్తూరు టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఓటర్ల స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జనార్దన్, పుత్తూరు పట్టణ కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి రావడానికి బిహార్ నుంచి ఎస్ఐఆర్‌ను ప్రారంభించిందన్నారు. పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించి, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం బాధ్యత తీసుకోవాలని కోరారు. విజయ్, ధన, గోవిందస్వామి, రవి, సుబ్రమణ్యం, కందస్వామి తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్

వరదయ్యపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవేలూరులో ఉన్న సీసీఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో సంతవేలూరు ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల్లో రూ.1,52,000తో గ్రానైట్ బండలు పరిచారు. పనులను సీసీఎల్ సీనియర్ మేనేజర్ కృష్ణకిశోర్, ప్లాంట్ హెడ్ సర్వేశ్వరరావు పరిశీలించారు.

అభివృద్ధి పనులతో మహర్దశ

ఏ డే విత్ తుడా చైర్మన్ కార్యక్రమం ప్రారంభం



తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులతో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి మహర్దశ కల్పిస్తామని ఎమ్మెల్యే సుధీర్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి చెప్పారు. ఏ డే విత్ తుడా చైర్మన్ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి శ్రీకారం చుట్టారు. ముందుగా ఊరందూరులోని ఎమ్మెల్యే సుధీర్ స్వగృహంలో నియోజకవర్గంలో సుందరీకరణ, డ్రైనేజీ ప్రక్షాళనపై చర్చించారు. అనంతరం ఏపీసీడ్స్ కూడలి నుంచి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ సంయుక్తంగా ద్విచక్ర వాహనంలో అధికార యంత్రాంగంతో పర్యటించారు. తిరుపతి రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు వెనుక వైపు స్వర్ణముఖి నది వద్ద ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుపై చర్చించారు. పార్కులో సుందరీకరణపై అధికారులతో కలిసి అధ్యయనం చేశారు. అక్కడి నుంచి పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. జయరామరావువీధిలో పారిశుధ్య కార్మికులతో కలిసి కాలువలోని వ్యర్థాలను తొలగించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను సత్కరించారు. ఆ తరువాత ఆర్టీసీ కూడలి నుంచి ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎమ్మెల్యే, తుడా నిధులతో కలిపి శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని చెప్పారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లా డుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు తుడా నిధులను మంజూరు చేస్తామన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు అంక్షింతల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారకారామానగర్‌లో అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.5.50 కోట్లు ప్రతిపాదించామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం కడకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు, ఏ డే విత్ తుడా చైర్మన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో అడుసుపాళెం, తారకరామానగర్‌లో పెద్ద సంఖ్యలో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారని, ఇక్కడ రీ సర్వే చేసి అనర్హులను గుర్తిస్తామన్నారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులను గెలిపించాలని కోరారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు, మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పాడి రాజేంద్ర, మునిరాజా, బాలాజీ, సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, నాదమునిరెడ్డి, వెంకటమునిరెడ్డి, పుష్పనాదం, లోకేష్ నాయుడు, మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే సుధీర్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాఠశాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే నెం.343/2లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని పాఠశాల అభివృద్ధికి కేటాయించారు. అందులో తుడా నిధులతో ఫుట్‌బాల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మూడు నెలల్లో ఆటస్థలం సిద్ధమవుతుందని చెప్పారు. అదే విధంగా కందాడు జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, మునగపాళెం సర్పంచ్ మంజుభార్గవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడు, నాయకులు మోహన్‌రావు, సతీష్‌నాయుడు, నాగరాజునాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, గిరినాయుడు, సూరినాయుడు, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి బొడుగు మునిరాజాయాదవ్, తహసీల్దారు భార్గవి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలీన పాఠశాలలకు వెళ్లని విద్యార్థులు



పాతపాళెం ప్రాథమిక పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కేవీబీపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచి ఇప్పటికి 43 రోజులు గడుస్తున్నా ఇంకా కొన్ని గ్రామాల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం లేదు. విలీనం పేరుతో అధికారులు చేసిన తప్పిదాలకు తమ పిల్లల భవిష్యత్తు పొలాల బాట పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని పాతపాళెం దళితవాడలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఎస్ఎంసీ చైర్మన్ స్వాతి ఆధ్వర్యంలో గ్రామస్తులు బడికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. విలీన పాఠశాలలకు తమ పిల్లలను పంపమని భీష్మించారు. దీనిపై ఎంఈవో లక్ష్మీపతి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చచెప్పినా వారు పట్టించుకోవడం లేదు. బంగారమ్మకండ్రిగ, గురుకులకండ్రిగ, వగత్తూరు, జ్ఞానమ్మకండ్రిగ తదితర గ్రామాల విద్యార్థులకు కూడా విలీన పాఠశాలలకు వెళ్లడం లేదు. కాగా పాఠశాలల అసంబద్ధ విలీనంపై కలెక్టర్‌కు విన్నవిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

మా పాఠశాల విలీనాన్ని ఆపండి

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో కొత్తవీరాపురం ప్రభుత్వ పాఠశాలను ఒడ్డిమిట్ట ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయడాన్ని నిలుపుదల చేయాలని కొత్త వీరాపురంవాసులు శుక్రవారం ఎంఈవో ప్రేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొత్త వీరాపురం గ్రామం నుంచి ఒడ్డిమిట్టకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అయితే అది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుందని చెప్పారు. ఈ మార్గంలో విద్యార్థులు ప్రయాణించి పాఠశాలలకు వెళ్లాలంటే ప్రమాదాల బారిన పడాల్సి ఉంటుందన్నారు.

సమైక్యంగా ముందుకు సాగుదాం

సత్యవేడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కార్యకర్తలు, నాయకులందరూ సమైక్యంగా ముందుకు సాగుదామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఏఎంపురం, కన్నావరం, జడేరి, అల్లప్పగుంటల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డితో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, పరమశివం, శివకుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు అన్నారు. సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని తంగేళ్ల పాళెంలో నిర్వహించారు. గాలి చలపతి నాయుడు, చెంచుకృష్ణమనాయుడు, ఎస్సీవీ కిరణ్ నాయుడు, రామకృష్ణనాయుడు, రామానాయుడు, మోహన్‌నాయుడుత దితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగూరు పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ధనంజయనాయుడు, గుర వారెడ్డి, పొన్నారావు, రాఘవేంద్రరావు, నాగరాజు నాయుడు, గిరినాయుడు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన

ఏర్పేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు నిర్వహించారు. పాపానాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల, ఏర్పేడు ప్రభుత్వ వైద్యశాలల పరిధిలోని ప్రజలకు ఆమందూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ ముందస్తు నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం 150మందికి పరీక్షలు నిర్వహించారు. పాపానాయుడుపేట వైద్యాధికారి లావణ్య, ఏర్పేడు వైద్యాధికారి శివప్రియ, డాక్టర్లు పద్మావతి, చైతన్యభాను, సీహెచ్‌వో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యం, మంజుల, ఎంఎల్‌హెచ్‌సీ లహరి, ఏఎన్ఎంలు సాహిర, ఉష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మునిరాజా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ తనిఖీ చేశారు. విదార్థులకు మెను ప్రకారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.

దారుశిల్పుల సమావేశం



శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళా సృష్టి కార్యాలయంలో దారుశిల్పుల సమావేశం గుమ్మడిపూడి దశరథాచారి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా తిరుపతి హ్యాండీక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి, డెవలప్‌మెంట్ కమిషనర్ నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులతో సెక్షన్ 8 కంపెనీ ఉపయోగాలు, దాని వల్ల కలిగే లాభాలపై చర్చించారు. పలువురు సభ్యులుగా చేరడానికి అంగీకరించారు.

మురుగు కాలువ శుభ్రం చేయిస్తా

రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మురుగు కాలువ శుభ్రం చేయిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు. 'రూ.20 వేలిస్తేనే కాల్వను శుభ్రం చేస్తామంటున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిలో ప్రచురితమైన కథనంపై ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు స్పందించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పూడిపోయిన కాలువను పంచాయతీ కార్యదర్శి మాధవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. స్థానికులను పిలిచి విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజరాజేశ్వరి ఆలయం వద్ద పూడిపోయిన కాల్వను శుభ్రం చేయిస్తామన్నారు. త్వరలో శాశ్వత కాలువ నిర్మిస్తామని చెప్పారు.

టీడీపీ మండల అధ్యక్షుడి పుట్టినరోజు వేడుకలు

కేవీబీపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలో ఆయన పేరిట పూజలు చేయించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, మల్లికార్జున్‌రెడ్డి, కేశవులునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు థామస్, బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): చేతి బోరు అందుబాటులోకి వచ్చింది. పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో చేతిబోరు మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని టీడీపీ వార్డు ఇన్‌చార్జి, రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.బుజ్జి ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పురపాలక సంఘ సిబ్బందిని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. దీంతో శుక్రవారం బోరుకు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మునిబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బాల సదనం తనిఖీ

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చాటూరురోడ్డులో ఉన్న బాల సదనాన్ని శుక్రవారం ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి తనిఖీ చేశారు. సదనంలో సౌకర్యాలు, రిజిస్టర్లు, స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లల ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

చెరువులో షెడ్ల తొలగింపు



రేణిగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నాస్వామిపల్లి పంచాయతీ పరిధిలో చెరువుని ఆక్రమించుకొని నిర్మించిన 27 రేకుల షెడ్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం కూల్చి వేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు... సర్వే నెం.380లో ఎకరా స్థలాన్ని ఆక్రమించి 27 రేకుల షెడ్లు నిర్మించారన్నారు. వారికి మూడుసార్లు నోటీసులు అందించినా స్పందించకపోవడంతో రేణిగుంట అర్బన్ పోలీసుల సాయంతో కూల్చి వేశామన్నారు. ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.